# మరమ్మతులు త్వరగా పూర్తిచేయాలి

- తెగిన రోడ్లు, వంతెనలు, చెరువులను పునరుద్ధరించండి
- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- ఇరిగేషన్, ఆర్అండ్బీ, ఆర్టీసీ అధికారులతో సమీక్ష



ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

**డిచ్పల్లి(నిజామాబాద్రూరల్):** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రూరల్ నియోజకవర్గంలో తెగిపోయిన రోడ్లు, వంతెనలు, చెరువులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అధికారులను ఆదేశించారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన ఇరిగేషన్, ఆర్అండ్బీ, ఆర్టీసీ అధికారులతో వేర్వేరుగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూరల్ నియోజకవర్గంలోని సిరికొండ, ధర్పల్లి, ఇందల్వాయి మండలాల్లో పలు చెరువులు, కుంటలు, వాగులు, చెక్ డ్యాములు, రోడ్లు భారీ వర్షాలకు తెగిపోయాయన్నారు. ఆయా గ్రామాల ప్రజలకు ఇబ్బంది కాకుండా త్వరగా మరమ్మతులు చేపట్టాలన్నారు. అనంతరం ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతూ.. కులాస్పూర్, హుస్సేన్నగర్, కొలిప్యాక్, రాంపూర్, రేకులపల్లి తదితర గ్రామాలకు బస్సులు నడపాలని సూచించారు. ఇరిగేషన్ ఈఈ నరేందర్, డీఈ ప్రేమ్ కుమార్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జ్యోత్స్న, డిప్యూటీ ఆర్ఎం సత్యనారాయణ, డిపో–1 మేనేజర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేను కలిసిన వీడీసీ సభ్యులు**

**సిరికొండ:** మండలంలోని తూంపల్లి నూతన వీడీసీ సభ్యులు సోమవారం ఎమ్మెల్యే భూపతిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. వీడీసీ చైర్మన్ తెడ్ల లక్ష్మణ్, మాజీ సర్పంచ్ బూస దేవరాజ్, కాసుల చిన్న లింగం, సాయన్న, కరుణాకర్, గోపి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాల చెరువు పునర్నిర్మాణం చేపట్టవద్దు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

**ధర్పల్లి:** హొన్నాజీపేట్ అటవీ ప్రాంతంలోని ముత్యాల చెరువును పున:నిర్మాణం చేపట్టవద్దని మండలంలోని వాడి, హొన్నా జీపేట్, బీరప్పతండా, మద్దుల్ తండా వీడీసీ సభ్యులు, గ్రామస్తులు కోరారు. ఈమేరకు వారు సోమవారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసి, వినపత్రాన్ని అందజేశారు. మళ్లీ చెరువు పున:నిర్మాణం చేపడితే దాని దిగువన ఉన్న గ్రామాల ప్రజలకు ప్రాణాలతోపాటు భారీ నష్టం వాటిల్లుతుందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇరిగేషన్ అధికారులతో సమీక్షించి నిర్ణయం తీసుకోవాల్సి వస్తుందన్నారు. అలాగే దుబ్బాక వీడీసీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం అందించాలి



వ్యాపారులతో మాట్లాడుతున్న సీపీ సాయి చైతన్య

**ఖలీల్వాడి:** నగర మార్కెట్ యార్డులో ఎలాంటి అనుమానాస్పద, చట్టవిరుద్ధ కార్యకలాపాలను గుర్తించిన వెంటనే వ్యాపారులు, ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని సీపీ సాయిచైతన్య సూచించారు. నగరంలోని మార్కెట్ యార్డ్ను సోమవారం ఆయన పరిశీలించారు. వ్యాపార సముదాయాలు, మార్కెట్ పరిసర ప్రాంతాలలో గల వ్యాపారుల, ప్రజలతో మాట్లాడి పలు విషయాలను తెలుసుకున్నారు. ప్రజలు, వ్యాపారులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్హెచ్వో రఘుపతి, ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే చెప్పండి



డిచ్పల్లిలో వివిధ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న డిచ్పల్లి ఎంపీడీవో రాజ్వీర్



సిరికొండలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

**డిచ్పల్లి:** స్థానిక సంస్థల ఎన్నికల ఎన్నికల నేపథ్యంలో మండలంలో ప్రదర్శించిన ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని ఎంపీడీవో రాజ్వీర్ రాజకీయ పార్టీల నాయకులను కోరారు. డిచ్పల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్లకు సంబంధించి అభ్యంతరాలను స్వీకరించారు. ఆయా పార్టీల నాయకులు చెప్పిన విషయాలను కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులకు పంపించి అభ్యంతరాలు ఉంటే తక్షణం సరిచేసి సమర్పించాలని ఎంపీడీవో సూచించారు. ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, నాయకులు అమృతాపూర్ గంగాధర్, నల్లవెల్లి సాయిలు, చంద్రకాంత్, వాసుబాబు, ధర్మాగౌడ్, నీరడి పద్మారావు, చౌకి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

**సిరికొండ:** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మనోహర్రెడ్డి సోమవారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓటరు జాబితాపై సమావేశం నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులతో కలిసి ఓటరు జాబితాల గురించి చర్చించారు. నాయకులు శ్రీనివాస్, రవి, రాజారెడ్డి, రమేష్రెడ్డి, దేగాం సాయన్న, సీపీఐఎంఎల్ నాయకులు భాస్కర్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### హెల్త్కేర్ సెంటర్లో సౌకర్యాలు కల్పించాలి



**తెయూ(డిచ్పల్లి):** తెలంగాణ యూనివర్సిటీలోని హెల్త్కేర్ సెంటర్లో సౌకర్యాలు కల్పించాలని ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈమేకు వారు సోమవారం హెల్త్కేర్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వైద్య సిబ్బందిని నియమించి, 24 గంటలు విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని, అవసరమైన మందులు, సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రిజిస్ట్రార్ యాదగిరి ధర్నా చేస్తున్న విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వీసీతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నా విరమించారు.

### డంపింగ్ యార్డు కోసం స్థల పరిశీలన



**మోపాల్:** మండలంలోని మంచిప్పలో డంపింగ్ యార్డు, షెడ్ కోసం గ్రామశివారులో స్థలాన్ని ట్రెయినీ కలెక్టర్ కరోలినా చింగ్తియాన్ మావీ సోమవారం పరిశీలించారు. గ్రామంలో డంపింగ్ యార్డు, షెడ్డు చెరువుకు ఆనుకుని ఉండటం, వర్షం కురిసినప్పుడు మురుగునీరంతా చెరువులోకి చేరడంతో నిజామాబాద్కు తాగునీటి సరఫరా చేసే చెరువు కలుషితమవుతుందని ఇటీవల గ్రామస్తులు కలెక్టర్కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఉన్నతాధికారుల సూచనలతో ఆమె సోమవారం మంచిప్ప శివార్లలో ప్రభుత్వ, అటవీ స్థలాలను పరిశీలించారు. ప్రభుత్వ భూములు ఏమైనా ఉంటే పరిశీలించాలని పంచాయతీ కార్యదర్శి శ్యామ్కుమార్కు సూచించారు.

### బడికి రూ.లక్ష విరాళం



**మోపాల్:** మండలంలోని సిర్పూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు లయన్స్ క్లబ్ ఆఫ్ సంస్కృతి–320(డి) హైదరాబాద్ వారు రూ.లక్ష విరాళాన్ని అందజేసినట్లు హెచ్ఎం సత్యనారాయణ సోమవారం తెలిపారు. పాఠశాలకు విరాళం అందజేయడంలో కృషి చేసిన డాక్టర్ కాసర్లను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు శ్యామల, మోహన్, అక్బర్ బాషా, వందన, డాక్టర్ హజారే శ్రీనివాస్ పాల్గొన్నారు.

### శస్త్ర చికిత్స లేకుండానే గుండెకు రంధ్రం మూసివేత



**నిజామాబాద్నాగారం:** మూడు ఏళ్ల చిన్నారికి శస్త్రచికిత్స లేకుండానే గుండెకు ఏర్పడిన రంధ్రాన్ని మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు మూసివేశారు. నగరంలోని మెడికవర్ ఆస్పత్రి గుండె వైద్య నిపుణులు సదానందరెడ్డి, సందీప్రావు సోమవారం వివరాలు వెల్లడించారు. చిన్నారి గుండెలో ఉన్న రంధ్రాన్ని శస్త్రచికిత్స చేయకుండా, ప్రత్యేక పరికరం (డివైస్ క్లోజర్) సహాయంతో విజయవంతంగా మూసివేశామన్నారు. ఈ విధానం నిజామాబాద్లో తొలిసారిగా అమలుచేశామన్నారు. ఈ అరుదైన చికిత్స ఫలితంగా చిన్నారి పూర్తి ఆరోగ్యవంతంగా కోలుకుందన్నారు.

## ఫిజియోథెరపిస్టుల సేవలు అభినందనీయం

- నగరంలో ఫిజియోథెరపీ భవన నిర్మాణానికి కృషి చేస్తా
- అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ




సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ

**నిజామాబాద్ నాగారం:** ఫిజియోథెరపిస్టులు అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని ప్రగతినగర్ మున్నూరుకాపు కల్యాణ మండపంలో సోమవారం నిజామాబాద్ ఫిజియోథెరపిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'వరల్డ్ ఫిజియోథెరపీ దినోత్సవం' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆధునిక జీవన శైలిలో ఫిజియోథెరపీ అత్యంత అవసరమైన వైద్య సేవగా మారిందన్నారు. ఫిజియోథెరపీ వైద్యుల కార్యకలాపాలను మరింత ప్రోత్సహించే దిశగా నగరంలో సొంత భవనానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు శివ కుమార్, ప్రధాన కార్యదర్శి ప్రమోద్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సందీప్ కుమార్, కీర్తి, అశ్విని, జోషి, రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

### నలుగురిపై కేసు నమోదు

**మోపాల్:** మండలంలోని సిర్పూర్ గ్రామంలో ఇటీవల గణేష్ నిమజ్జనం సందర్భంగా విధులు నిర్వహించిన పోలీసులకు ఆటంకం కలిగించిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుష్మిత సోమవారం తెలిపారు.

### రెండు బైక్లు ఢీ: ఇద్దరికి గాయాలు

**మోపాల్:** మోపాల్లోని అంబేడ్కర్ చౌరస్తాలో సోమవారం రాత్రి రెండు బైక్లు ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలు అయ్యాయి. నిజామాబాద్ నుంచి మంచిప్ప వెళుతున్న ఓ బైక్, నర్సింగ్పల్లి వైపు నుంచి మోపాల్కు వస్తున్న కులాస్పూర్కు చెందిన మరో బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కాగా స్థానికులు వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### టోల్ప్లాజా వద్ద అగ్ని ప్రమాదం



**ఇందల్వాయి:** ఇందల్వాయి టోల్ప్లాజా వద్ద సోమవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో పార్సిల్ వ్యాన్ ఇంజిన్ దగ్ధమైంది. వివరాలు ఇలా.. హైదరాబాద్ నుంచి నాగ్పూర్ వైపు వెళుతున్న పార్సిల్ వ్యాన్ టోల్ప్లాజా దాటగానే డ్రైవర్ వాహనాన్ని ఆపి డీజిల్ను ఒక ట్యాంక్ నుంచి మరో ట్యాంక్కు నింపుతుండగా మంటలు అంటుకున్నాయి. వెంటనే గన్నారం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా వారు వచ్చి మంటలను ఆర్పారు. ప్రమాదంలో డ్రైవర్కు ఎలాంటి గాయాలు కాలేదని, ఆస్తి నష్టం కూడా జరగలేదని ఫైర్ సిబ్బంది తెలిపారు.

### ఎఫ్పీవో సభ్యత్వ నమోదు



**నిజామాబాద్ రూరల్:** మాధవనగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎఫ్పీవో సభ్యత్వ నమోదును సీఈవో సిహెచ్ వంశీకృష్ణ సోమవారం నిర్వహించారు. సభ్యులు, రైతులు సభ్యత్వం తీసుకున్నారు. ఎఫ్పీవో సభ్యత్వం పొందడం ద్వారా రైతులకు సబ్సిడీ, ప్రభుత్వ పథకాల లబ్ధి, ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో సంఘు అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు, డైరెక్టర్లు, ముమ్మనేని ఫణి, వంగ రవీందర్, టేకుర్తి జనార్దన్, గంట సాంబశివరావు ఉన్నారు.

### ఎన్పీడీసీఎల్ డైరెక్టర్కు సత్కారం



**సుభాష్నగర్:** ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ (వరంగల్) మోహన్రావు జిల్లాకు అధికారికంగా మొదటిసారి రావడంతో సోమవారం జిల్లా అధికార యంత్రాంగం ఘనంగా సన్మానించింది. ఎస్ఈ రవీందర్, బోధన్ డీఈ ముక్తర్, వెంకటరమణ, ఎస్ఏవో శ్రీనివాస్, ఏడీలు తోట రాజశేఖర్, ప్రసాద్రెడ్డి, అశోక్, చంద్రశేఖర్, ఈఈజేఏసీ చైర్మన్ రఘునందన్, కన్వీనర్ శ్రీనివాస్, నాయకులు తదితరులున్నారు.

### చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి



**నిజామాబాద్అర్బన్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు అన్నారు. నగరంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగానికి నిధులు కేటాయించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమైనవన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర బాలికల కన్వీనర్ మక్కపల్లి పూజ, నాగలక్ష్మి, నూర్జహాన్, సుజాత, దీపిక, విగ్నేష్, అజాద్, చక్రి, గోవింద్, రాజు, వినీత్, బాలమణి, సరిత, రూప తదితర నాయకులు పాల్గొన్నారు.

### క్రీడాకారులకు అభినందనలు



**నిజామాబాద్నాగారం/జక్రాన్పల్లి:** జాతీయస్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ చాటిన జిల్లా క్రీడాకారులను డీఈవో అశోక్ అభినందించారు. నగరంలోని టీఎన్జీవోస్ భవన్లో సోమవారం వ్యాయామ ఉపాధ్యాయుల వార్షిక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల మధ్య వ్యత్యాసం లేకుండా క్రీడాపోటీలను నియమ నిబంధనలతో నిర్వహించాలని వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం జాతీయ, రాష్ట్రస్థాయి పతకాలను సాధించిన క్రీడాకారులను సన్మానించారు. డీసీఈబీ సెక్రెటరీ సీతయ్య, గోపిరెడ్డి శ్రీనివాస్, నాంచారి శ్రీనివాస్, కృష్ణంరాజు, రాజు, భారతి, ఇందిరా, నీరజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

**నిజామాబాద్ సిటీ:** ఆశ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఆశ వర్కర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆశలకు రూ.18 వేల వేతనం, సీనియర్లకు ప్రమోషన్లు, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సుకన్య, శోభ, ఛిజి, నర్సా, రేణుక, రాధా, శైలజ, గంగామణి, విజయ, కవితలు పాల్గొన్నారు.

### ముగ్గురి రిమాండ్

**ధర్పల్లి:** మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలో బైకును దగ్ధం చేసిన ఘటనలో ముగ్గురిని అదుపులోకి తీసుకొని రిమాండ్కు తరలించినట్లు ఎస్సై కళ్యాణి సోమవారం తెలిపారు. కాలనీలోని ఆకుల కళ్యాణ్పై ఆదివారం రాత్రి కనకం కిషోర్, షేక్ ఇమ్రాన్, జోగినిపల్లి రాహుల్ గౌడ్ దాడి చేసి, వెళ్లిపోయారు. అర్ధరాత్రి సమయంలో వారు కళ్యాణ్ ఇంటికి వచ్చి బెదిరించి, బైక్ను ఎన్టీఆర్ చౌరస్తాకు తీసుకెళ్లి పెట్రోల్ పోసి తగలబెట్టి పారిపోయారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, నిందితులను పట్టుకున్నారు.

## మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం





మోపాల్లో సన్మానం పొందిన ఉత్తమ ఉపాధ్యాయులు.. జక్రాన్పల్లిలో..

**మోపాల్/జక్రాన్పల్లి/సిరికొండ:** నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో సోమవారం మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు విద్యాశాఖ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. మోపాల్ మండలంలో 13 మంది టీచర్లను మండల స్థాయిలో ఎంపిక చేయగా, బోర్గాం(పి) జెడ్పీహెచ్ఎస్లో వారిని ఎంఈవో గేమ్ సిబంగ్ సన్మానించారు. అదేవిధంగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను కూడా సన్మానించారు. జక్రాన్పల్లి మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 26 మందిని ఎంపీడీవో సతీష్ కుమార్, ఎంఈవో శ్రీనివాస్ సన్మానించారు. సిరికొండలో మండల స్థాయిలో ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులను అధికారులు సన్మానించారు.

**కాలూరు ఉపాధ్యాయుడికి జాతీయస్థాయి పురస్కారం**

**నిజామాబాద్ రూరల్:** కాలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు శ్రీమన్నారాయణాచార్య విరాట్కి జాతీయ స్థాయి గౌరవం లభించింది. మధ్యప్రదేశ్లోని దతియాలో ఆదివారం అఖిల భారతీయ సాహిత్యకార్ సమ్మేళనం సందర్భంగా ఆదిత్య సంస్కృతి సాహిత్య మాసపత్రిక వారి ఆధ్వర్యంలో డా. అన్నపూర్ణ బధౌరియా స్మారక సాహిత్య పురస్కారం అందుకున్నారు. విరాట్కు పురస్కారం రావడంపై హెచ్ఎం శోభ, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

**ఎస్ఎస్ఆర్ కళాశాలలో..**



**నిజామాబాద్అర్బన్:** నగరంలోని ఎస్ఎస్ఆర్ కళాశాలలో సోమవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల అధ్యాపక బృందం విద్యాసంస్థల అధినేత మారయ్యగౌడు, డైరెక్టర్ హరితగౌడ్తోపాటు మరికొందరిని సన్మానించారు. డైరెక్టర్ హర్షిత్, ప్రిన్సిపల్ రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్ భూమయ్య, శ్యామ్ కుమార్, వేణుగోపాల్, తక్షశిల తదితరులు పాల్గొన్నారు.

### నిత్యావసర సరుకుల అందజేత



**సిరికొండ:** మండలంలోని కొండూర్ గ్రామంలో వరద బాధితులకు సిరికొండ సత్యశోధక్ పాఠశాల ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులను ప్రిన్సిపాల్ నర్సయ్య సోమవారం అందజేశారు. పెద్దవాల్గోట్ గ్రామంలో బాల వికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వరద బాధితులకు నిత్యావసర సరుకులు, టార్పాలిన్లు అందచేశారు. సిరికొండ ఎంఎస్ ఫంక్షన్హాల్ ఆధ్వర్యంలో వరద బాధితులకు రూ. 8వేలు అందజేశారు.

## సంక్షిప్తం

**ప్రశాంత్రెడ్డిని కలిసిన వీజీగౌడ్**



**డిచ్పల్లి:** కెనడా పర్యటన ముగించుకుని స్వదేశానికి విచ్చేసిన మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ.గంగాధర్గౌడ్ సోమవారం బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. తన కెనడా పర్యటన వివరాలను వివరించారు.

**రాకపోకలు ప్రారంభం**

**సిరికొండ:** మండలంలోని పెద్దవాల్గోట్ వద్ద కోతకు గురైన రోడ్డుకు ఆర్అండ్బీ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల మరమ్మతులు చేపట్టారు. సోమవారం పనులు పూర్తికావడంతో ఆర్టీసీ బస్సులతోపాటు ఇతర వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి.

**ఘనంగా అక్షరాస్యత దినోత్సవం**

**నిజామాబాద్ అర్బన్:** నగరంలోని కోటగల్లీ జీపీఎస్లో సోమవారం పీఆర్టీయూ జిల్లా శాఖ గౌరవ అధ్యక్షుడు కృపాల్సింగ్ సోఢి ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్ఎం రామచందర్ గైక్వాడ్ ప్రసన్న కుమారిలను సత్కరించారు.

**అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ శిక్షణకు ఎంపిక**

**డిచ్పల్లి:** అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ శిక్షణకు డిచ్పల్లి మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడు గంగాప్రసాద్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్దశరథ్ సోమవారం తెలిపారు. ఈనెల 9 నుంచి 12వరకు చిత్తూరు జిల్లా కుప్పంలో నిర్వహించే శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని తెలిపారు.

**డీఈవోకు సన్మానం**

**నిజామాబాద్ రూరల్:** నగరంలోని ఆర్బీవీఆర్ హైస్కూల్లో సోమవారం డీఈవో అశోక్ను ఆర్బీవీఆర్ సొసైటీ సభ్యులు సన్మానించారు. సొసైటీ ప్రతినిధులు ప్రవీణ్రెడ్డి, వెంకటరమణారెడ్డి, జగత్రెడ్డి, గంగాకిషన్, వీణారెడ్డి ఉన్నారు.

**నలంద పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం**

**నిజామాబాద్ అర్బన్:** నగరంలోని నలంద హైస్కూల్లో సోమవారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పాఠశాల అధ్యక్షుడు మురళీకృష్ణ, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారుపతకాన్ని, సర్టిఫికెట్స్ను అందజేశారు.

**దివ్యాంగులకు పింఛన్లు పెంచివ్వండి**

**నిజామాబాద్ అర్బన్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు పింఛన్లను పెంచి ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్, నాయకులు, దివ్యాంగులు ఉన్నారు.

**వేతనాల కోసం ఆర్పీల ధర్నా..**

మెప్మాలో పనిచేస్తున్న ఆర్పీలు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. గత కొన్ని నెలలుగా వేతనాలు సక్రమంగా అందడం లేదని అధికారులు వెంటనే వేతనాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

**డిచ్పల్లిలో ముస్లింల ర్యాలీ**

**డిచ్పల్లి:** మండల కేంద్రంలో సోమవారం ముస్లింలు మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం మజీద్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. డిచ్పల్లి సీఐ వినోద్, ఎస్ఐ ఎండీ షరీఫ్ తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

### బంగారం ధరలు (10గ్రాములు)

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్స్ | 111,200 | వెండి(కిలో) | 1,30,500 |
| 22 క్యారెట్స్ | 102,675 | | – నిజామాబాద్ బిజినెస్ |

### మాంసం ధరలు

| | | | |
|---|---|---|---|
| చికెన్ | ధరలు (కిలోకు) | డ్రెస్సిడ్ | 160 |
| | | లైవ్ | 120 |
| స్కిన్లెస్ | 200 | మటన్ | 800 |

### కూరగాయల ధరలు(రూ.)

| | హోల్సేల్ | రిటైల్ | | హోల్సేల్ | రిటైల్ |
|---|---|---|---|---|---|
| టమాట | 24 | 48 | గాజరుగడ్డ | 30 | 60 |
| బెండకాయ | 30 | 60 | పచ్చిమిర్చి | 30 | 60 |
| బీరకాయ | 40 | 80 | దోసకాయ | 15 | 30 |
| దొండకాయ | 30 | 60 | ఆలుగడ్డ | 20 | 40 |
| బీర్నిసుకాయ | 60 | 110 | గోబిగడ్డ | 15 | 30 |
| కాకరకాయ | 30 | 60 | గోబిపువ్వు | 30 | 60 |
| వంకాయ | 40 | 80 | బీట్రూట్ | 30 | 60 |
| పాలకూర | 50 | 100 | కరివేపాకు | 40 | 80 |
| మెంతికూర | 60 | 110 | చామగడ్డ | 30 | 60 |
| కొత్తిమీర | 40 | 80 | చిక్కుడుకాయ | 60 | 100 |
| పుదీనా | 50 | 100 | గోరుచిక్కుడు | 40 | 80 |
| క్యాప్సికం | 40 | 80 | | | |

–సుభాష్నగర్

